క్లుప్తంగా

శిల్పారామంలో దసరా సంబరాలు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో దసరా పండుగ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తూ, సంబరాలు చేపట్టనున్నట్లు ఏఓ ఖాదర్‌వల్లీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడు రోజులపాటు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఆదివారం భార్గవి రాజు ఆధ్వర్యంలో భరతనాట్యం, 23వ తేదీన పాండిచ్చేరి కళాకారుల భరతనాట్యం, తమిళ జానపద నృత్యాలు, మరగాళ్ల జానపద ప్రదర్శన, 24న కోటి బృందం ఆధ్వర్యంలో సినిమా, జానపద నృత్యాలు నిర్వహిస్తామని తెలిపారు. దశమి రోజున అమ్మవారికి శిల్పారామంలో ప్రత్యేక పూజలు చేస్తామని, సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమాలను నగర ప్రజలు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



డిప్యూటీ సీఎం నారాయణస్వామి, వీవీఎస్ లక్ష్మణ్

తిరుమల: శ్రీవారిని శుక్రవారం డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ దర్శించుకున్నారు. అనంతరం వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం అందించగా టీటీడీ అధికారులు లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

విద్యార్థి పేరు ఆన్‌లైన్‌లో ఉండాలి

పాకాల: పాఠశాలల్లో చదివే విద్యార్థి పేరు ఆన్‌లైన్‌లో కచ్చితంగా ఉండాలని ఎంఈఓ బాబ్జీ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంలు, కార్యాలయం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలల్లో చదివే ప్రతీ విద్యార్థి ఆధార్‌కార్డుతో ఆన్‌లైన్ చేయాలని సూచించారు. పాఠశాల నుంచి వెళ్లిపోయిన విద్యార్థులకు టీసీలు కూడా ఆన్‌లైన్‌లోనే చేయాలని తెలిపారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చెకుముకి పరీక్షల్లో పాల్గొనండి

తిరుపతి ఎడ్యుకేషన్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న చెకుముకి సైన్సు సంబరాల్లో భాగంగా నిర్వహించే టాలెంట్ టెస్టులో హైస్కూల్ విద్యార్థులు పాల్గొనాలని ఆ వేదిక జిల్లా అధ్యక్షుడు చెంగయ్య పిలుపునిచ్చారు. తిరుపతిలోని యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబరు 10న హైస్కూల్ స్థాయి, 30న మండల, డిసెంబర్ 17న జిల్లా స్థాయిలో టాలెంట్ టెస్టులు జరుగుతాయని తెలిపారు. ఈ సమావేశంలో జన విజ్ఞాన వేదిక నాయకులు షరీఫ్, రమణయ్య, ఊహ సంపత్‌కుమార్, జయశ్రీ, రఫీ, ఓవీ రమణ, ఇమామ్, పవన్ పాల్గొన్నారు.

రచయిత నామినికి సత్కారం


రచయిత నామినిని సత్కరిస్తున్న నేతలు

తిరుపతి కల్చరల్: వైఎస్ఆర్ జీవిత సాఫల్య పురస్కార గ్రహీత ప్రముఖ రచయిత నామిని సుబ్రమణ్యం నాయుడిని శనివారం తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి, అభినందించారు. ఈ మేరకు రచయిత నామిని స్వగృహంలో ఆయన్ను ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కె.మోహన్‌కుమార్ రాజు,కార్యదర్శి కొల్లె వాసుదేవ్‌లు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు.

జాతీయ తైక్వాండో పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న ఏఎస్పీలు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో శనివారం ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో 5వ జాతీయ స్థాయి ఇన్విటేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్–2023 పోటీలు ప్రారంభమయ్యాయి. ఏఎస్పీలు జె.కులశేఖర్, జె.వెంకటరావు ముఖ్యఅతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌కుమార్, బాబురావు, బి.ఆనందరావు, వెంకట్, బాలకృష్ణ పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

తిరుపతి కల్చరల్: శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో శనివారం రాత్రి ఎ.శబరి గిరీష్ గాత్ర కచేరి, ఎ.ప్రభావతి బృందం ప్రదర్శించిన నృత్యాభినయం ఆకట్టుకుంది.

నారాయణునికి కళా సేవ


సూర్య ప్రభ వాహన సేవలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తదితరులు


అలరించిన శ్రీవారి కళారూపాల ప్రదర్శన


చంద్ర ప్రభ వాహన సేవలో నృత్య ప్రదర్శన


టీటీడీ చైర్మన్ భూమనకు జీయర్ల ఆశీర్వచనం


క్షీర సాగర మథనం కళారూపాలు

తిరుమల: శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజైన శనివారం ఉదయం సూర్యప్రభ వాహన సేవలో వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన కళాబృందాల ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో 15 కళాబృందాల్లో 408 మంది కళాకారులు పాల్గొని సంగీత, నృత్య ప్రదర్శనలతో భక్తులను పరవశింప చేశారు. ముంబయి చెందిన డాక్టర్ అనురాధ బృందం లవని అనే జానపద కళారూపాన్ని, సేలంకు చెందిన కలైవాణి బృందం కొట్టారవాయ్ అనే జానపద కళారూపాన్ని ప్రదర్శించి కనువిందు చేశారు. బెంగళూరుకు చెందిన ఇందూ బృందం కృష్ణావతార వైభవ లీలా విశేషాలను నృత్య రూపంలో ప్రదర్శించారు. తిరుపతి శ్రీవేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల విద్యార్థులు, తిరుపతికి చెందిన సుకన్య బృందం సూర్యప్రభ వాహన నృత్యంతో అలరించారు. బెంగళూరుకు చెందిన శివాని బృందం కంసాలి నృత్యం, శ్రీకాకుళం జిల్లాకు చెందిన శోభాకుమారి బుట్ట నృత్యంతో అలరించారు. అనంతపురానికి చెందిన నాగ వర్షిణి బృందం శ్రీనివాస సంకీర్తనా నృత్య రూపకాన్ని నయనానందకరంగా ప్రదర్శించింది. భీమవరానికి చెందిన కేశవ కుమార్, తిరుమలకు చెందిన ఉద్యోగుల బృందం కోలాటం ప్రదర్శించారు. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన వాసు బృందం ముని కన్యల నృత్యం, కడపకు చెందిన కూచిపూడి నృత్యంతో కనువిందు చేశారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న


తిరుచ్చిపై స్వామి,అమ్మవార్లు

చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలో బంగారు తిరుచ్చిపై శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవను చేపట్టారు. సర్వాలంకర శోభితుడైన శ్రీనివాసుడు, అమ్మవార్లతో కలసి తిరుచ్చి వాహనంపై ఆశీనులై భక్తులను కటాక్షించారు. డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

నూతన కోర్టు భవనాల పరిశీలన


నూతన కోర్టు భవనం వద్ద న్యాయవాదులతో జిల్లా న్యాయమూర్తి భీమారావు

పాకాల: నూతనంగా నిర్మించిన కోర్టు భవనాన్ని జిల్లా న్యాయమూర్తి భీమారావు పరిశీలించారు. ఈ సందర్భంగా శనివారం కోర్టు నూతన భవనాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణంలో కొన్ని చిన్నచిన్న మార్పులు చేయాలని సూచనలు చేశారు. ముఖ్యంగా కక్షిదారులు రావడానికి కోర్టు ముఖద్వారం నుంచి వచ్చేలా వీలు కల్పించాలని, ఆ విధంగా నిర్మాణం చేపట్టాలని తెలిపారు. పాకాల–చిత్తూరు రోడ్డు మార్గంలోని రైల్వే గేటు సమీపంలో నిర్మించిన కోర్టు భవనం అహ్లాదకరమైన ప్రదేశంలో నిర్మించారని, ఇక్కడ కోర్టు కార్యకలాపాలకు అనువుగా ఉంటుందని సంతృప్తిని వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ నవంబర్ 15వ తేదీకల్లా భవన నిర్మాణాన్ని పూర్తి చేసి అప్పగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాకాల కోర్టు న్యాయమూర్తి షేక్ బాబాజాన్, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రవి, న్యాయవాదులు గురుస్వామినాయుడు, గౌరీశంకర్‌రాజు, మధుసూదన్‌రెడ్డి, రెడ్డెప్పనాయుడు, ప్రవీణ్‌ప్రకాష్, మురళి పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ


ఎర్రావారిపాళెం పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి

భాకరాపేట: ఎర్రావారిపాళెం పోలీస్ స్టేషన్‌ను తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. శనివారం సాయంత్రం తిరుపతి ఎస్పీ, చంద్రగిరి డీఎస్పీ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా తిరుపతి ఎస్పీ మాట్లాడుతూ ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపామన్నారు. తలకోన పర్యాటక కేంద్రంలో కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అటవీ సరిహద్దు గ్రామాలపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. ప్రజలతో పోలీసులు స్నేహపూరిత వాతావరణంలో పని చేస్తున్నారన్నారు. ఈ సందర్భంలో చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్, భాకరాపేట సీఐ సురేంద్రరెడ్డి, ఎర్రావారిపాళెం ఎస్ఐ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

తిరుపతి టౌన్ సర్వీస్‌కు 50 విద్యుత్ బస్సులు

తిరుపతి అర్బన్: నగరంలో త్వరలో 12 మీటర్లు పొడవు కలిగిన (లాంగ్ సర్వీసులు) 50 విద్యుత్ బస్సులను టౌన్ సర్వీసులుగా అందుబాటులోకి తీసుకొస్తామని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. తిరుమల కొండతోపాటు నెల్లూరు, కడప, మదనపల్లె, రేణిగుంటకు 9మీటర్ల పొడవు కలిగిన ఇప్పటికే 100 విద్యుత్ సర్వీసులను నడుపుతున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. శనివారం తిరుపతి సెంట్రల్ బస్టాండ్ ఆవరణలో నెడ్‌క్యాప్ సంస్థ ద్వారా గో ఎలక్ట్రిక్ – గో గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టారు. వివిధ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల కాలుష్యం ఎంతో ప్రమాదమని, కలసికట్టుగా అరికట్టడానికి అంతా విద్యుత్ వాహనాల కొనుగోలుకు మొగ్గు చూపాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులకు సులభ వాయిదాల పద్ధతిలో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలను నెడ్‌క్యాప్ సంస్థ ద్వారా అందించడానికి శ్రీకారం చుట్టినట్టు వెల్లడించారు. త్వరలో తిరుపతి నుంచి కోయంబత్తూరు, మధురైకి సర్వీసులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈనెల 28, 29 తేదీల్లో తిరువణ్ణామలైకు 150 సర్వీసులను ఏర్పాటు చేస్తున్నామని, అందులో 50 ఏసీ బస్సులను పంపుతున్నట్లు వెల్లడించారు. ఆర్టీసీ డెప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, ఏటీఎం రామచంద్రనాయుడు, నెడ్‌క్యాప్ జిల్లా మేనేజర్ రామలింగయ్య, డిఓ దిలీప్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది మానస, క్రాంతి, లావణ్య పాల్గొన్నారు.

క్వారీ ప్రమాదంలో కార్మికుడు మృతి

చంద్రగిరి: క్వారీలో చోటుచేసుకున్న లారీ ప్రమాదంలో కార్మికుడు మృతి చెందిన ఘటన శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు మండలంలోని తాటికోన సమీపంలో తెలుగుదేశం పార్టీకి చెందిన శ్రీధర్ నాయుడుకు సంబంధించిన శ్రీనివాస స్టోన్ క్రషర్స్ ఉంది. ఇందులో చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన సుంకం మార్కం(19) అనే యువకుడు గత కొన్నేళ్లుగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం క్వారీ గుట్టపై నుంచి బండ రాళ్లు వేసుకుని లారీలో కిందకు దిగాడు. అయితే లారీలో అధిక లోడు ఉండడంతో ఒక్కసారిగా ఓ వైపు కుంగిపోయింది. ప్రమాదం నుంచి తప్పించుకునేందుకు హఠాత్తుగా లారీ నుంచి కిందకు దూకేశాడు. లారీ ఒక్కసారిగా మార్కంపై బోల్తాపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం బయటకు పొక్కడంతో పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతికి తరలించారు.

శ్రీమహాలక్ష్మిదేవిగా గంగమ్మ


శ్రీతాతయ్యగుంట గంగమ్మ

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఆరో రోజు శనివారం అమ్మవారు శ్రీమహాలక్ష్మిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్, పాలక మండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిషాసుర మర్ధినిగా శ్రీకన్యకాపరమేశ్వరి

కొత్త వీధిలోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం అమ్మవారు శ్రీమహిషాసుర మర్ధిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ సత్యనారాయణ, కార్యదర్శి దిండుకుర్తి నరసింహులు, కోశాధికారి శిరీష మంజునాథ్, సభ్యులు పాల్గొన్నారు.

యువ కళాకారులకు ప్రోత్సాహం

- అన్నమయ్య సంకీర్తనల రికార్డింగ్‌లో ప్రాధాన్యం
- ప్రముఖ సంగీత దర్శకులు సాలూరి వాసూరావు

తిరుమల: అన్నమయ్య సంకీర్తనల్లోని భక్తిభావనను జనబాహుళ్యంలో విస్తృత ప్రచారం కల్పించడంతో పాటు, సంకీర్తనల రికార్డింగ్‌లో స్థానిక యువ కళాకారులకు టీటీడీ ప్రాధాన్యం కల్పిస్తోందని ప్రముఖ సంగీత దర్శకులు సాలూరి వాసూరావు చెప్పారు. తిరుమల రాంభగీచా–2లోని మీడియా సెంటర్‌లో ఎస్వీ రికార్డింగ్ ప్రాజెక్టు ప్రత్యేకాధికారి విభీషణ శర్మ, ప్రముఖ సంగీత దర్శకులు, గాయకులతో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. సాలూరి వాసూరావు మాట్లాడుతూ టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి శాస్త్రీయ సంగీతంలోని మాధుర్యాన్ని, వేంకటేశ్వర స్వామివారి వైభవాన్ని భక్తులకు చేరువ చేయడంతో పాటు స్థానిక కళాకారులను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. టీటీడీ 10 సంకీర్తనలు ఒక సిడిగా రూపొందిస్తోందన్నారు. వీటిని రాగ తాళ యుక్తంగా స్వరపర్చి పంపితే, పరిశీలించిన తరువాతే రికార్డింగ్ చేస్తున్నట్లు వివరించారు. ప్రముఖ గాయకులు శ్రీనివాస శర్మ మాట్లాడుతూ శ్రీవారి అనుగ్రహంతో అన్నమయ్య సంకీర్తనలు ఆలపించే అవకాశం లభించినట్లు చెప్పారు. ఎస్వీ రికార్డింగ్ ప్రాజెక్టు ప్రత్యేకాధికారి డాక్టర్ విభీషణ శర్మ ప్రసంగిస్తూ జనం నోట కొత్తగా స్వరపరిచిన అన్నమయ్య సంకీర్తనలు పలికించాలన్నారు. ఇప్పటి వరకు 290 సంకీర్తనలు భక్తులకు అందించామని, త్వరలో మరో 300 సంకీర్తనల సీడీలు అందించనున్నట్లు వివరించారు. మీడియా సమావేశంలో ఏపీఆర్వో కుమారి పి.నీలిమ, గాయకులు శ్రీదేవి, భాగ్యశ్రీ, అనన్య పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బంది సేవలు భేష్

తిరుపతి అర్బన్: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో తిరుపతి జిల్లా పరిధిలోని ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు సమష్టిగా పనిచేశారని చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి కొనియాడారు. శనివారం ఆయన్ను తిరుపతి నగరంలోని ఓ ప్రయివేటు హోటల్‌లో జిల్లా ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ చైర్మన్ మాట్లాడుతూ తిరుమల బ్రహ్మోత్సవాల్లో చిన్నపాటి ఇబ్బందులు లేకుండా భక్తులకు అవసరమైన మేరకు ఆర్టీసీ సర్వీసులు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మరోవైపు రాష్ట్రంలో రాబడిలోనూ తిరుపతి జిల్లాను ముందువరుసలో ఉంచుతున్నారని కితాబిచ్చారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు పోటెత్తిన జనం


జగనన్న ఆరోగ్య సురక్ష మందుల కిట్‌లను అందజేస్తున్న ఎంపీటీసీ రాజయ్య తదితరులు

చంద్రగిరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన వస్తోందని ఎంపీటీసీ రాజయ్య అన్నారు. టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడి సొంత పంచాయతీ కందులవారిపల్లిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున క్యాంపు వద్దకు చేరుకుని వివిధ వ్యాధి సమస్యలపై వైద్యులను సంప్రదించారు. తహసీల్దార్ శిరీష క్యాంపును పరిశీలించి, రోగుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారు 386 మందికి పైగా ప్రజలు వైద్య సేవలను పొందినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, సెక్రటరీలు మీనా, గిరిబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గంగిరెడ్డిపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష

రామచంద్రాపురం: గంగిరెడ్డిపల్లిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఆరోగ్యంపై శ్రద్ధ అవసరమన్నారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, వైఎస్ఆర్ సీపీ నాయకులు భానుకుమార్‌రెడ్డి, సర్పంచి భారతి పాల్గొన్నారు.

హోమ్ డెకార్స్‌లో ప్రత్యేక లేటెక్స్ పరుపులు


హోమ్ డెకార్స్‌లో ప్రత్యేక లేటెక్స్ పరుపులు

తిరుపతి కల్చరల్: వంద శాతం నేచురల్ అండ్ కూల్ ఆర్థోపెడిక్ లేటెక్స్ మ్యాట్రిస్ పరుపులు అందించడం హోమ్ డెకార్స్ ప్రత్యేకత అని హోమ్ డెకార్స్ అధినేత పి.కిషోర్‌కుమార్ తెలిపారు. 15 ఏళ్ల క్రితం హోం డెకార్స్ ఏర్పాటుతో మన్నికైన, నాణ్యమైన అధునాతమైన గృహ అలంకరణ డెకార్స్ అందిస్తూ ఆదరణ పొందామన్నారు. హోమ్ డెకార్స్‌లో వెన్నునొప్పిని నియంత్రించే సరికొత్త లేటెక్స్ మ్యాట్రిస్ పరుపులను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇవి తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులోని స్మార్ట్ బజార్ ఎదురుగానున్న హోం డెకార్స్‌లో అందుబాటులో ఉన్నాయి. లేటెక్స్ పరుపులు 30 శాతం తక్కువ ధరతో అందించడమేకాక ప్రతి పరుపు కొనుగోలుపై ఉచితంగా తలగడలు, బెడ్‌షీట్ ఫిట్టర్, వాటర్ ప్రొటెక్టర్‌ను అందిస్తున్నట్లు హోం డెకార్స్ అధినేత తెలిపారు. లేటెక్స్ సింగిల్ కాట్ రూ.9 వేలు నుంచి లక్ష రూపాయల ధర వరకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వివరాలకు 9390581437ను సంప్రదించాలని కోరారు.

రహదారుల నిర్మాణం విజయవంతం

తిరుపతి తుడా: నగరంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రహదారుల నిర్మాణాన్ని నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. స్థానిక భవానీ నగర్ వద్ద గల టీటీడీ పరిపాలనా భవనానికి దక్షిణం వైపున పెద్ద కాలువపై నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను శనివారం ఇంజినీర్లతో కలిసి ఆమె పరిశీలించారు. భవాని నగర్ రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగుతుండడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు విస్తరణ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్డు విస్తరణ పనులను పర్యవేక్షించాలని ఎస్ఈ మోహన్‌ను ఆదేశించారు. వెంకట్రామిరెడ్డి రెడ్డి, డీఈ విజయకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సదుపాయం కల్పించండి

రామచంద్రాపురం: సీరామాపురం పంచాయతీ జగనన్న కాలనీకి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని కాలనీవాసులు కోరుతున్నారు. బోరు మోటార్లకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో తాగునీరు రావడం లేదంటూ శనివారం జెడ్పీటీసీ భర్త భానుకుమార్‌రెడ్డి గ్రామస్తులతో కలసి డిమాండ్ చేశారు. తాగునీటి బోర్లకు మూడు నెలలుగా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వకుండా అధికారులు ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు.

గ్రంథాలయాల్లో పై ఆఫ్ ది సర్కిల్ పుస్తకాలు

తిరుపతి కల్చరల్: పై సిద్ధాంతంపై పరిశోధన చేసిన పత్రాలను క్రోఢీకరించి పై ఆఫ్ ది సర్కిల్ పేరుతో ప్రచురించిన పుస్తకం అన్ని యూనివర్సిటీల్లోని గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్నాయని తిరుపతికి చెందిన విశ్రాంత అధ్యాపకుడు సర్వ జగన్నాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 78 ఏళ్ల వయస్సు కలిగిన జంతుశాస్త్ర విశ్రాంత అధ్యాపకుడైన ఈయన 15 ఏళ్లుగా గణితంలోని పై సిద్ధాంతంపై పరిశోధన చేశారు. ఆయన 26 ఏళ్లు చేసిన పరిశోధనల తర్వాత 1998 మార్చిలో నిజమైన కచ్చితమైన పై విలువను కనుగొన్నారు. ఇది నిజమని చెప్పేందుకు నేటి వరకు ఆయన పరిశోధనలు చేస్తున్నారు. ఈమేరకు ఆయన వందలాది పరిశోధన పత్రాల్లో 80 పత్రాలు అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురించబడ్డాయి. ఈ పత్రాలన్నింటిని క్రోఢీకరించి ఆయన పై ఆఫ్ ది సర్కిల్ పేరుతో ముద్రించిన పుస్తకాన్ని ఎస్వీయూ వీసీ విష్కరించారు. ఒక సిద్ధాంతాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పేరుతో ప్రచురించామని తెలిపారు. ఈ సిద్ధాంతం పేరు జగన్‌మోహన్‌రెడ్డి థీరమ్‌గా గూగుల్ పొందపరిచినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు గూగుల్లో జగన్‌మోహన్ రెడ్డి థీరమ్ అని టైపు చేసి చూడవచ్చని తెలిపారు.

పోలీసుల సేవలు ప్రశంసనీయం


అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న డీఎస్పీలు మురళీధర్, చెంచుబాబులు, పోలీసులు

తిరుపతి మంగళం: దేశంలో శాంతి భద్రతలను పరిరక్షణలో అనునిత్యం అసాంఘిక శక్తులతో పోరాడుతూ తమ ప్రాణాలను సైతం అర్పిస్తున్న త్యాగమూర్తులు పోలీసులని టాస్క్‌ఫోర్స్ డీఎస్పీలు మురళీధర్, చెంచుబాబులు తెలిపారు. తిరుపతి కపిలతీర్థం సమీపంలో ఉన్న టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో శనివారం పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం పోలీసుల అమరవీరుల స్థూపానికి డీఎస్పీలు, పోలీసులు ఘనంగా నివాళులర్పించారు. టాస్క్ ఫోర్సులోనూ స్మగ్లర్ల దాడులలో పలువురు ప్రాణాలను కోల్పోయిన విషయాన్ని గుర్తు చేశారు. సీఐ శ్రీనివాసులు, ఆర్ఐ సురేష్‌కుమార్ రెడ్డి, ఎఫ్ఆర్‌ఓలు మురళీకృష్ణ, ప్రేమ, ఆర్ఎస్ఐలు లింగాధర్, విశ్వనాథ్ అమరవీరులకు నివాళులర్పించారు.

శ్రవణానందకరం


మాట్లాడుతున్న ఎల్లా వెంకటేశ్వరరావు

తిరుపతి కల్చరల్: శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో శనివారం రాత్రి పద్మశ్రీ డాక్టర్ ఎల్లా వెంకటేశ్వరరావు ప్రదర్శించిన మృదంగ లయ విన్యాసం శ్రవణానందకరంగా సాగింది. అంతకుముందు ఆయన మాట్లాడుతూ 1961 నుంచి శ్రీవారి సేవలో నిరంతరంగా పాల్గొనడం తన పూర్వ జన్మసుకృతమన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలతో పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. తిరుమల శ్రీవారి ఆశీస్సులతో ముఖ్యమంత్రి భవిష్యత్‌లో పేదలకు మరో 18 రత్నాలు అందించాలని ఆకాంక్షించారు. కళాకారుడిగా జీవన పయనం సాగిస్తున్న తాను ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి గురించి మాట్లాడలేదని, ప్రజలకు సేవ చేసే ముఖ్యమంత్రి గురించి చెప్పడం బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. శ్రీవారి దయతోనే రెండు సార్లు గిన్నిస్ బుక్ రికార్డులు సాధించానని, నిరంతర కఠోర సాధనతో కొన్ని వేల మంది శిష్యులను తయారు చేయగలిగానని, ఇది ఆ శ్రీవారి కటాక్షమేనని తెలిపారు.

సూర్య,చంద్రులపై అనంత తేజోమూర్తి

సూర్య ప్రభపై తుమ్మలగుంట కల్యాణ వెంకన్న


సారె తీసుకువస్తున్న మహిళలతో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



వాహన సేవలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తుమ్మలగుంట కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలలో శనివారం సూర్య, చంద్ర ప్రభ వాహనాలు వైభవోపేతంగా సాగాయి. సర్వాలంకార భూషితుడైన స్వామివారు కటాక్ష వీక్షణాలను భక్తులకు అందజేశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు. - తిరుపతి రూరల్


తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అభివాదం